# ముఖేష్ పాట

యూనివర్సిటీలో ఉపన్యాసాల పోటీ జరుగుతోంది.

ఈరోజున ఆడవాళ్ళని ఫెయిర్ సెక్స్ (చక్కని జాతి) అనడం తప్పా లేక తప్పున్నరా? అనే విషయాన్ని చర్చిస్తారు. 'తప్పు' అని మాట్లాడేవాళ్లకి 5 ని.. టైం ఇస్తారు. తప్పున్నర అని మాట్లాడేవాళ్లకి (ఒక్కొక్కరికి) దానికి ఒకటిన్నర రెట్లు అంటే ఏడున్నర ని.. టైం ఇస్తారు. 'తప్పు కానేకాదు' అని కూడా ఎవరేనా వాదన చేయచ్చు. కాని వాళ్లకి మాట్లాడేందుకు ఏం టైం ఇవ్వరు. అలాంటి వాళ్లు ఓసారి స్టేజి ఎక్కి 'తప్పు కాదు' అనిచెప్పి వెంటనే దిగిపోవాలి.

అప్పటికి ఒకతను 'స్త్రీ జాతిని ఫెయిర్ సెక్స్ అనడం తప్పు' అని మొదలుపెట్టి. కొంచెం మొహమాటపడి (పొరపడి, తడబడి, హడలకొట్టబడి) రెండు నిముషాలైనాక ఏం మాట్లాడుతున్నదీ మరిచిపోయి పాకిస్తాన్‌ని నిశితంగా విమర్శించి, మద్యపానం తప్పే అని ఒప్పేసుకుని (5 నిముషాలూ వాడుకోకుండా ముందే వేదిక నించి దిగిపోడం చేత) అందరి అభిమానాన్ని చూరగొన్నాడు.

తరవాత మాకృష్ణ స్టేజి ఎక్కుతుంటే, వాడూ 'అలాగే' మాట్లాడి వినోదం కలిగిస్తాడని అందరూ ఆశలు పెట్టుకున్నారు. వాడు 'తప్పున్నర' వాదాన్ని సమర్థిస్తాడన్న మాట. వాడు మైక్ ముందు నిల్చుని 'ఇంత చిన్న విషయాన్ని కూడా నేనే చెప్పాలి' అనిపించేలా 'హుఁ' అన్నాడు. ఓ క్షణం ఆగి 'హుఁ హుఁ' అన్నాడు. అంతా ఆశ్చర్యపోడం మొదలెట్టారు. ఆ అదును చూసుకుని కృష్ణ మాట్లాడేయడం మొదలు పెట్టాడు. "అసలూ ఇది సమస్యే కాదు. తమని ఫెయిర్ సెక్స్ అనడం తప్పుకాదు - తప్పున్నర అని ఆడవాళ్ళు ఎప్పుడో తెలుసుకున్నారు. కాని, మొగాళ్లకే తెలీలేదు. ఇంతకీ సెక్రటరీ మొగాడు కావడం వల్లనే ఈ అంశం చర్చకు రాగలిగింది."

వింటూ మొగాళ్లంతా తమని పొగిడినట్లే సంతోషించేస్తున్నారు. 'ఫస్ట్ ప్రైజ్ - ఫస్ట్ ప్రైజ్' అని కేకలు కూడా వినపడసాగాయి.

వెంటనే అమ్మాయిల మధ్యనించి ఓ అమ్మాయి రాకెట్‌లా పైకిలేచి తన నేస్తంతో 'ఇన్‌సల్ట్' అని చెప్పేసి, ముక్కుపుటాలు ఎగరేయడం చేత కాక, వేళ్లతో పట్టుకుని ఎగరేసి విసవిసా నడిచి వెళ్లిపోయింది. వెళ్తుంటే ఆమె రెండు జడలూ డజను కొరడాల్లా గాలిలో ఛెళ్లు

మన్నాయి. ఆ అమ్మాయి విసురుచూసి అమ్మాయిలందరూ విస్తుపోయారు.

'చీరె కట్టుకోడం చేతకాక పరికిణీ, వోణి వేసుకుంటోందీ! మనిషి చూస్తే జడంతలేదూ! అయినా ఎంత మిడిసిపాటో తల్లీ. మా చిన్నప్పుడు-' అనుకుంది ఓ పెద్ద అమ్మాయి. 'జానెడు జెడలేదు, అప్పుడే ఎంత పొగరు!' అనుకున్నారు జానెడేసే జెడలున్న ఇద్దరు అమ్మాయిలు. మరో ముగ్గురు అమ్మాయిలు ముక్కుమీద వేలేసుకుని అలాగే ఉంచేసి తరవాత కాసేపైనాక ఆవేళ్లేమైనాయో అని కంగారు పడ్డారు.

కృష్ణ మిన్నంటిన కరతాళధ్వనుల మధ్య లెక్చర్ పూర్తిచేసి మళ్లీ నాపక్కని కూర్చునేసరికి నాకు వాడిమీద భలేకోపంగా ఉంది. ఓ అమ్మాయికి - అందులోనూ 'ఆ' అమ్మాయికి వీడు కోపం తెప్పించాడని -.

ఆ అమ్మాయి మామూలు అందర్లాంటి అమ్మాయికాదు. కథలు అలాంటి అమ్మాయిల గురించే ఎక్కువగా రాస్తారు.

'సిగ్గు లేదురా?' అన్నాను.

వాడు పరధ్యానంగా జేబులన్నీ తడిమిచూసుకుని 'లేదోయ్, ఇదే ఉంది' అని ఓ నలిగిపోయిన చేమంతి గుత్తి తీశాడు. ఆ చేమంతి చెండుకృష్ణకి నిన్ననే దొరికింది, ఓ అమ్మాయి సిగలోంచి జారిపడగా అద్భుతమైన సమయస్ఫూర్తితో తెలివిగా ధైర్యంగా పోయి ఏరి తెచ్చుకున్నాడు. ఆ చేమంతుల అమ్మాయి పేరు రాజ్యలక్ష్మి. ఇంటి పేరు రెండు జడల. ఈఏడే యూనివర్సిటీలో చేరింది.

ఈ రెండుజడల రాజ్యలక్ష్మేనన్న మాట ఇపుడు కృష్ణ మాటలు విని కోపం తెచ్చుకుని జెడలు విసిరి వెళ్లిపోయిన అమ్మాయి.

కృష్ణ స్థితి తల్చుకుంటే జాలేసింది. వాడు ఆపాత చేమంతుల్ని చూసుకుని మురిసి పోతున్నాడే కాని 'తప్పున్నర' అని ఆ అమ్మాయి వింటూండగా మాట్లాడ్డం వల్ల తనకి పట్టిన దుర్గతి గురించి వాడికి వూహేలేదు.

నేను చెప్పనూ లేదు. చెప్పి లాభం ఏముంది? ఆ అమ్మాయికి ఇందాకల్లా ఎంత కోపం వచ్చిందని! ఇంక కృష్ణని జన్మలో క్షమిస్తుందా? వీడు ఎంత ఏడిచి మొత్తుకున్నా, వీడి మొహం చూస్తుందా, అందుకే రాజ్యలక్ష్మి క్కోపం వచ్చిందని చెప్పి కృష్ణని ఇప్పుడే ఏడిపించదల్చుకోలేదు నేను.

ఆ తరవాత రాజ్యలక్ష్మి మా చెల్లాయి స్నేహితురాలనీ తనకి బఠాణీలూ, కుక్కపిల్లలూ అంటే చాలా ఇష్టమనీ తెలిసి కృష్ణ పొంగిపోయాడు.

అలా రెండు రోజులు దొర్లిపోయాయి.

మేం ఇద్దరం (చాలా ముఖ్యమైన పని ఏదో ఉండి) సరదాగా బజార్లో తిరుగుతున్నాం. రెండు చాలా పాతకార్లు ఎదురెదురుగా వచ్చి కంగారుగా ఆగిపోయాయి. దాంతో - అది విశాఖపట్నం రాజవీధి కావడంచేత - వెంటనే రాకపోకలు స్తంభించిపోయాయి. పోలీసులు పరుగెత్తుకొచ్చారు.

ఎటూ పోయేదారి లేక పేవ్ మెంట్ మీద చేతనైనంత జాగ్రత్తగా నిలుచున్నాం. కృష్ణ ఉత్సాహంగా "బాబీ-ట్రాఫిక్ జామ్ రోయ్! మన వైజాగుకూడా కొన్నాళ్లలో న్యూయార్క్ లా అయిపోతుంది. న్యూయార్క్ లో ఓనూరుకార్లు ఒక్కసారి వస్తే తప్ప రాకపోకలు ఆగవు. ఇక్కడ రెండుకార్లే చాలు ఆపని చేయడానికి. అంచేత న్యూయార్క్ కంటే వైజాగే గొప్పది. ఎలాగంటే అప్పల నరసయ్య ....." అంటూ గొలుసుకట్టుగా మాట్లాడుకుపోతున్నాడు. నాకు కాలక్షేపం కలిగిస్తున్నాననుకుంటూ.

చివరికి 'ఊఁ సొద' అన్నాను.

'సొదకాదు. నేనో సూట్ కేస్ కొనాలి. నాబట్టలు మరీ ఎక్కువై పోయాయి. నాపెట్టె చాలడం లేదు ....

నిజమే. కృష్ణకి నలుగురికి చాలినన్ని బట్టలున్నాయి. ఓ, సెకన్ గడిచాక వాడు పక్కనున్న షాపుల్లోకి చూసి 'బాబీ ఆఫ్రికన్ సిల్క్ హవుస్'లో కెళ్దాంరా. మంచి ఉలెన్స్ వచ్చాయిట' అని నన్ను లాగేయడం మొదలెట్టాడు. నేను ఆశ్చర్యపడి, వాడు లాగుతుంటే మళ్లీ పడడం ఇష్టంలేక వాడితో కదిలాను. షాప్ మెట్లెక్కుతుంటే తెలిసిపోయింది ... లోపల

రెండుజడల (ఇప్పుడు ఒక జడ వేసుకున్న) రాజ్యలక్ష్మి, మాచెల్లి ఏవో గుడ్డలు చూస్తున్నారు !

'ఎలా పసిగట్టావురా. కళ్లజోడు తీసేస్తే గజం దూరం చూడలేనివాడివి?" అన్నాను మెల్లిగా. 'అది అంతేలే. ప్రేమిస్తే కాని తెలీదు నీకు. నువ్వో అప్పలమ్మని గాఢంగా కళ్లు మూసుకుని ప్రేమించావనుకో. ఆ చి॥సౌ॥ అప్పలు నీకు ఫర్లాంగుదూరంలో ఎక్కడున్నా నీకు వెంటనే గుండెల్లో షాక్ కొట్టేసి, పాటలు వినిపించేసి ..." అంటూ వాడు లోపలికి సాగిపోతుంటే గుమ్మంలోనే ఆపేశాను. మమ్మల్ని చూసి 'లోపలికిరండీ ఏం కావాలి మీకు' అంటూ వచ్చాడు ఓ చెవిలో పెన్సిల్ ఉన్న అతను. నేను లోపలున్న అమ్మాయిల్ని ఉద్దేశించి "ముందస్తుగా వారిని కొనుక్కోని వెళ్లనీండి. తరవాత మేం చూస్తాం" అన్నాను. దాంతో అతను చెవిలో పెన్సిల్ జారిపోయినంత ఉషారుగా, రెండు కుర్చీలులాగి కూర్చోమన్నాడు. మేం మర్యాదస్తులమని అపోహపడి.

రాజ్యలక్ష్మికి ఏమీ నచ్చడం లేదు. ఆపిల్ల తరహాయే అంత. పాపం షాప్ యజమాని ఆమెకు నచ్చే గుడ్డ ఒక్కటైనా ఉండకపోతుందా అని ఆశపెట్టుకుని మొత్తం బీరువాలన్నీ ఖాళీచేసి వాళ్లముందు పోగు పెట్టాడు. ఆగుడ్డలన్నీ మా చెల్లి శాయిశక్తులా నలిపేస్తూ, మడతలు పాడుచేస్తూ రాజ్యలక్ష్మి మెప్పుపొందాలని చూస్తోంది. చివరికి రాజ్యలక్ష్మికి ఓ గులాబీరంగు పువ్వులున్న రకం నచ్చింది. అది పరీక్షగా చూసి, ధర అడగబోతూ మావేపు తిరిగింది.

అంతే. రాజ్యలక్ష్మి నన్ను; కృష్ణనీ, కృష్ణాసురుణ్ణీ, కృష్ణాధముణ్ణీ, కిష్టిగాణ్ణీ ఒక్కసారి చూసి చేతిలో ఉన్న మడత అక్కడ పడేసి 'మళ్లీ వస్తాం' అని మెరుపులా మాపక్కనించి దూసుకుపోయింది. చెల్లికూడా ఇంకో మెరుపులా (నన్ను క్లుప్తంగా వెక్కిరించి) వెళ్లిపోయింది. ఇదంతా జరగడానికి ఇది చదవాలంటే పట్టినంత టైం కూడా పట్టలేదు.

కృష్ణ హృదయం కూడా ఆ అమ్మాయితో వెళ్లిపోయిందిగా. మరి వాడి మొహానికి రక్తం ఎవరు సప్లై చేస్తారు. అంచేత అది తెల్లపోయింది.

షాప్ యజమాని బంగారుపళ్లు కొరికి మింగేసేవాడిలా చూశాడు మమ్మల్ని. బేరం చెడగొట్టామని. మేం పచ్చి పోకిరీలనీ, అంచేత ఆడపిల్లలు మామీద అసయ్యంతో కొనేది కొనకుండా వెళ్లిపోయారనీ అర్థం చెప్పుకుని పైకి మాత్రం 'హుఁ' అన్నాడు. మేం అతన్ని పొగడాలని 'హుఁ అవునండి. హుఁ కదూ !' అన్నాం. మా పొగడ్తలు విని అతనేం సంతోషించ లేదు., ఇంకాస్త కోపంగా చూశాడంతే.

కృష్ణ 'మాఅక్కకి జాకెట్ గుడ్డలు కొనాలి రావోయ్' అని లోపలికి నడిచాడు. ఒకుర్రాడు పరిచిఉన్న గుడ్డలు బీరువాల్లో పెట్టేస్తున్నాడు. కృష్ణ తొందరగా వాడితో 'ఆ జాకెట్ గుడ్డలు ఇవతల ఉంచవోయ్. మాకు కావాలి' అన్నాడు. కుర్రాడు నాలుగుపళ్లు వూడిపోయినవాడిలా ఇకిలించి 'ఇవి - ఇహె - పరికిణీ గుడ్డలండీ' అన్నాడు.

'అవీ కావాలి ఉంచు' అన్నాడు కృష్ణ. అని, రాజ్యలక్ష్మి ఇందాకా కొనబోయిన గులాబీపువ్వుల పరికిణీ గుడ్డ ఖరీదు అడిగాడు. దాంతో షాప్ యజమాని సరదా పడిపోయి, తను మామీద కోప్పడ్డం వూరికే తమాషాకి చేసినపని అనీ, అలా చేయడం తనకి అలవాటేననీ అన్నట్లు చిరునవ్వుతో, 'గజం మూడున్నరండి. ఇంకా ఖరీదైనవి ఉన్నాయి. చూస్తారా' అన్నాడు.

'అబ్బే ఒద్దులెండి. మాకు ఇదే కావాలి'

'ఎంతండి'

'ఓ గజం చాలు.' అని నాతో 'పరికిణీకి ఓగజం చాలు కదురా' అన్నాడు. వాడు చాలా జాగ్రత్త మనిషి.

'చాలదనుకుంటా' ఎందుకేనా మంచిదని అలా అన్నాగాని (పదిహేనేళ్ల అమ్మాయికి) పరికిణీకి గజం చాలని నాకూ తెలుసు.

'యూనివర్సిటీలో చదువుతున్నారు. మీకు తెలీందేముంది. అయితే ఇపుడు వెళ్లిపోయిన అమ్మాయిలు మూడుగజాలు కావాలన్నారు మరి'.

"మూడు గజాలు. హుఁ. పరికిణీకి మూడు గజాలా. ఆడవాళ్లంతే దుబారా మనుషులు- దానికేం గాని ఓ మూడు గజాలు ఇవ్వండి ఈరకం" అన్నాడు కృష్ణ.

ఆ పేకెట్ తీసుకుని బయటపడ్డాం. ప్రేమలో అసలు పడనే కూడదుగాని పడ్డాక ఎన్నిపాట్లైనా పడాలి తరించి ఒడ్డున పడాలంటే.

రాజ్యలక్ష్మికి తనంటే ఒళ్లుమంట అని కిష్టిగాడికి తెలియలేదు. తనని చూసి ఆపిల్ల శరవేగంతో పారిపోతుంటే అదంతా సిగ్గు అనీ, ఇంకేదో అనీ భ్రమపడుతున్నాడు. సిగ్గు కాదనీ, కోపం అనీ నచ్చచెప్తే వాడు ఎలాగా ఏడుస్తాడు. అంచేత ముందే కంగారు పెట్టడం ఇష్టంలేక చేతనైనంత సరదాగా 'నువ్వంటే రాజ్యలక్ష్మికి భలే కోపమోయ్" అన్నాను.

వాడు నడ్డి విరిగిన వాడిలా కూలపడిపోయి 'ఎందుకూ !' అన్నాడు.

'ఎందుకేమిటి ! ఆవేళ నువ్వు గొప్పగా లెక్చర్ దంచలేదూ? వాళ్లని అందమైన జాతి అనడం తప్పున్నర అంటూ. అది విని ఆ అమ్మాయి హృదయం గాయపడి-'

'నిజంగానే .... ?'

'కాదు. కలగన్నాను...ఓరి జడ్డీ!'

'అందుకు నేనేం చెయ్యను?'

'అంత గొప్పపని ఓసారి చేశాక ఇంకేం చెయ్యక్కర్లేదులే. ఆపిల్లకి నువ్వంటే పూర్తిగా కోపం వచ్చేసింది. ఇంకేం చేసినా పోదు. నువ్వంటేనే కాదు మొత్తం మగజాతి మీదేట. ఎంత వరకు పోయిందో తెలుసా? రెండు జడలు వేసుకోడం మానేసింది."

'ఆఁ' కృష్ణ పానుమంచు మింగేసిన ఆళ్వారుస్వామిలా ఒణికిపోయాడు.

'అవును మరి ! నీ మీద కసి తీరే వరకు రెండు జడలు వేసుకోనని శపథంట.'

'నన్ను తన్నినా భరిస్తాను. కాంతం కథలు చదివి నవ్వమన్నా నవ్వుతాను. రేడియో ముందు కట్టిపడేసి అరవపాటలు వినమన్నా చిరునవ్వుతో సహిస్తాను. కాని రెండుజడల అమ్మాయి రెండు జెడలు వేసుకోకపోతే చూసికూడ ఎలా బతకనోయ్' అని వాపోయాడు.

నా గుండె తరుక్కుపోయింది.

చాలా తీవ్రంగా ఆలోచించి (నాది చాలా నిశితమైన బుద్ధి) 'ఒక్కటే దారి ఉందిరా. రాజ్యలక్ష్మికి ఇష్టమైన, చాలా ఇష్టమైన వస్తువేదో తెలుసుకోడం. ఆ వస్తువే నీకూ ఛాలా ఇష్టమని ఆమెకు తెలిసేలా చేయడం'.అప్పుడేమైనా ఆశ ఉంటుందేమో' అన్నాను.

ఆ అమ్మాయికి ఏం ఇష్టమో తెలుసుకోవాలని నేను, కృష్ణ కలిసి చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయిపోయాయి. రాజ్యలక్ష్మికి బఠానీలు పంచప్రాణాల్లో ఒకటని మాకెప్పుడో తెలుసు. కాని అవి కృష్ణకి కూడా ఇష్టమేనని ఆమెకు తెలిస్తే ఆమె మురిసిపోవడానికి ఏం కారణంలేదు. ఆమాట కొస్తే బఠానీలు అంటే ప్రాణంలా చూచుకునేవాళ్లు వాళ్ల ఇంట్లోనే ముగ్గురున్నారట.

చివరికి నేను చెల్లిసాయం కోరకతప్పలేదు. ఏవో అవీ ఇవీ మాట్లాడి చివరికి 'క్రిష్ణ అంటే ఎందుకే అంతకోపం. వాడు-'చెల్లి ఠకీమని చెప్పేసింది.

"ఎందుకేమిటి-ఆమాట కొస్తే నాకూ కోపం వచ్చింది." కొంచెం ఎర్రగా అంది.

"ఇంక ఆకోపం పోదా?"

పోదన్నట్లు తల రుకాయించింది.

'అస్సలు పోదా' అన్నాను.

'పోదు. అతనికి బాగా బుద్ధి చెప్పేదాకా నాకీ కోపం పోదే అని చెప్పింది కూడాను.'

'ఎలా బుద్ధి చెప్తుందిట్ట?'

'అతనికి ఎలాగో అవమానం చెయ్యాలి. అది దానివ్యూహ' రాజ్యలక్ష్మికి ఈడుకి మించిన వ్యూహలు అన్నీ ! ఆపిల్ల వ్యూహనీ, అదేపిల్ల పచ్చటి సంపంగి ముక్కునీ కలిసి తల్చుకుంటే' నవ్వొస్తుంది.

"ఓహో, వాణ్ణి అవమానించాలనా! వాణ్ణి పెళ్లిచేసుకుంటే సరిపోతుందిగా" అన్నాను.

చెల్లి కోప్పడింది. 'పెళ్లిట ! మేం ఎవరం అసలు పెళ్లి చేసుకోం. మరి-అది కాదన్నాయ్. దానికి కోపం రానేరాదు. ఒచ్చిందా ముఖేష్ పాట విన్నా కూడా పోదు. అని ఓ క్షణం తీవ్రంగా ఆలోచించి "ముఖేష్‌పాట వింటే పోతుందేమోలే, ఓసారి-'అంది.

"ముఖేష్ పాటలు రాజ్యలక్ష్మికి ఇష్టమేమిటి- కొంపతీసి" అన్నాను, లోపల చాలా సంతోషిస్తూ.

'ఇష్టం ముఖేష్ అంటే ప్రాణం రాజ్యానికి. అతని గొంతుకవింటే దానికి ఒళ్లు తెలియదు. ఓసారి ముఖేష్ పాటవింటూ పెన్సిల్ సగం తినేసింది. మరోసారి-'

"పెన్సిళ్లంటే కూడా ఇష్టమా, లక్ష్మికి?"

"ఛీ. చేతిలో పెన్సిల్ వుంది. అదికాస్తా పాటవింటూ కొంచెం కొంచెం కొరికేసిందన్న మాట".

'సరే ఎవరేనా అబ్బాయి ముఖేష్‌లా పాడుతాడనుకో వింటే ఏం చేస్తుంది?'

'ఏమో. ముఖేష్ అంటే మాత్రం ప్రాణం. కలల్లో కూడా కనిపిస్తాడట.' అంది చెల్లి ఒక్కగుక్కలో.

'దొరికిందిరా, దొంగ !' అనుకున్నా. అమ్మాయికి ముఖేష్ అంటే పిచ్చి. మాకృష్ణకి కూడా ముఖేష్ అంటే ప్రాణం" అని తెలిస్తే కృష్ణ క్షణంలో గొప్పవాడై పోతాడు. ఆ అమ్మాయికి. అదీ నా వ్యూహ.

కొంతసేపు మేఘాల్లో తేలిపోయాను. చిక్కు విడిపోయింది. కృష్ణకి కూడా ముఖేష్ అంటే చాలా ఇష్టమనీ, నిత్యం కలవరిస్తూ ఉంటాడనీ, రాజ్యలక్ష్మికి అది తెలిసి ఒక్కసారి నాలిక్కరుచుకుని, ఆనొప్పితో కన్నీరు రాల్చడం, కృష్ణని అభిమానించేయడం అదంతా తమాషాగా నాకళ్ళముందు మెదిలింది.

కాని ఓ చిన్న చిక్కు ఉంది, అంతా బాగానే ఉంది కాని మాకృష్ణకి ముఖేష్ అంటే పంచ ప్రాణాలూ కాకపోవడం అటుంచి, అతను ఎవరో కూడా సరిగ్గా తెలీదు. ముఖేష్ ప్లేబాక్ పాడ తాడని వాడికి తెలిసి నెలైంది. ముఖేష్ అంటే అది ఒక పాటకాదని మూడురోజుల క్రితం తెలిసింది. ముఖేష్ పాడుతున్నాడురా అని చెప్తే మాత్రం ముఖేష్ గొంతుక వెంటనే గుర్తించేవాడు.

సాయంత్రం మామూలుగానే క్రిష్ణ నాదగ్గరకొచ్చాడు. వాడు తలదువ్వుకోలేదు. షర్ట్‌కి గుండీలు పెట్టుకోలేదు. ఓచెయ్యి మడిచాడు. మరోటి మడవలేదు. చెప్పులు కూడా ఒక కాలుకి తొడుక్కుని మరోకాలుకి తొడుక్కోలేదేమోనని చూశాను కాని రెండు చింకిచెప్పులు కనిపించాయి. మంచి చెప్పులు కొని కూడా వేసుకోవడంలేదు. ముఖంలో ఏదో . . . . .

'నేనింక బ్రతకనురా ...' అన్నాడు.

'నీకేం ! నీ అవతారం చూడలేక-మేం ఛస్తున్నాం' అన్నాను. కాని వెంటనే వాడు రాజ్యలక్ష్మి గురించి మాట్లాడబోతున్నాడని తెలిసి, 'ఊ మరే .. ఏ' అన్నాను.

'ఆ అమ్మాయి నన్ను జన్మలో క్షమించదు. నావేపు చూడనేనాచూడదు. చూసినా

నేనో చీమనో, దేశద్రోహినో, అరవం రాని తెలుగు వాళ్లతో అరవం మాట్లాడే తెలుగువాణ్ణో అన్నట్లు చూస్తుంది. నేను ఏ సైనైడో-'

"ఛ ఛ; సిగ్గు లేదట్రా? నేను ఉన్నానుగా.. నువ్వు చెయ్యవలసింది ఒక్కటే ! నీకు ముఖేష్ అంటే పంచ ప్రాణాలూ అనీ అందరికీ తెలియాలి' అన్నాను.

"ముఖేష్ ! అంతకంటే నాకు బోర్డే అంటే ఎక్కువ ఇష్టము ....బేగ్...'

'ఓరినీ ! ముఖేష్ అంటే-'

'ఓ.......ఓ........సారి; ఇప్పుడు గుర్తొచ్చింది. పాడతాడు కదూ !'

'అఘోరించలేక పోయావు. రాజ్యలక్ష్మికి ముఖేష్ అంటే చాలా ఇష్టంట. అంతిష్టం ఉన్నవాళ్లు ఆపిల్లకి ఇంకెవరూ కనిపించలేదు. నువ్వు అలాంటి వాడివని తెలిస్తే-'

"తెలిసిందోయ్, తెలిసింది !' అని వాడు హాబీగా ఆయాస పడుతూ అరచేసి 'ఊ' . ఏం చెయ్యాలో చెప్పు. నువ్వేం చెప్పినా వింటాను. ' అన్నాడు.

నేను అట్టే మాట్లాడే మనిషిని కాను. ఏదైనా రెండు ముక్కల్లో చెప్పేస్తాను. అంచేత ఇలా చెప్పాను. 'నువ్వు ఇప్పుడే పోయి ముఖేష్ రికార్డులన్నీ కొనుక్కురా. మనం ఓ గ్రామఫోన్ సంపాదిస్తాం. పాటలన్నీ కంఠతా పట్టు. పాడ్డం నేర్చుకో. మంచులో పడుకోడం మొదలుపెట్టి త్వరగా జలుబు పట్టించుకో....వగైరా.

అంతా విని వాడు నిట్టూర్చాడు. 'ఎంతకష్టపడాలోయ్. మనం ఏం కావాలన్నా ఇంత యాతన పడాలి. సరేలే అన్నాడు. నాకేదో పెద్ద ఉపకారం చేస్తున్నట్లు. గొప్ప అయిడియా ఇచ్చేనన్న సరదాలో నేనదేం పట్టించుకోలేదు. మేం వెంటనే మా ప్లాను ఆచరించడం మొదలు పెట్టేశాం.

పక్క గదిలో నా టైప్ మిషన్ గట్టి తన్నాన్ని పరీక్షిస్తూ రాజ్యలక్ష్మి కూర్చుని ఉందని చెవిఛాయగా తెలుస్తోంది. చెల్లి అన్నాయ్ రెండవుతోంది. రేడియో ! అని అక్కణ్ణించే అరిచింది. 'కిష్టగాడు వస్తే బావుణ్ణు ........అమ్మాయి కూడా ఇక్కడే ఉంది' అనుకున్నా గాని నాకు వాడిలో నమ్మకం లేదు. వాడికి ఇప్పటికీ ముఖేష్ పాటలు అన్నీ తెలియలేదు. 'అందాజ్'లో అతని పాటలున్నాయోయ్ అంటే ఆశ్చర్యపోయాడు మొన్న ! అయినా ఎందుకో ఆశగా ఉంది....'

రేడియో ట్యూన్ చేశాగాని నాకు దృష్టి అటులేనే లేదు. ఇంతలో కృష్ణ ఉషారుగా వచ్చేసి చెమట తుడుచుకొన్నాడు. 'ముఖేష్ కాదుకాని నాదుంప తెంచుతున్నాడు. ఎక్కడా అందాజ్ రికార్డులు దొరకలేదు. పైగా వాళ్లు నవ్వారు' అన్నాడు కోపంగా. నాకూ నవ్వొచ్చింది. ఆ సినిమా అంత పాతది మరి- ఆరికార్డులు ఎక్కడ దొరుకుతాయి యిప్పుడు !

'ఊఁ సరే. కూచో. అని రాజ్యలక్ష్మి పక్కగదిలో ఉందని మెల్లగా చెప్పాను.

'ఊఁ? ....ఏమిటీ పాట.ఛీ. ఇదేమిటే. ముఖేష్‌పాట ఒస్తే బాగుణ్ణు' అన్నాడు వూరంతా వినబడేలా. నేను కంగారు పడిపోయాను. ఎందుకంటే ఆ వినిపిస్తున్న పాట ముఖేష్ కన్హయ్యా'లో పాడింది. మొన్ననే నేనూ క్రిష్ణా ఆ సినిమా చూసొచ్చాం.

కోపంగా పెదవి కొరికి 'ఇడియట్'. ఇది ముఖేష్ పాడుతున్నాడు.' అన్నాను. వాడు తెల్లబోయి వెంటనే నల్లబోయి ముఖేష్ పాడుతున్నాడు వినవోయ్. 'కన్హయ్యా'లో పాట అబ్బ! ఏం గ్రాండుగా ఉంటుంది. వింటుంటే....'

'కరిగిపోతాం. మన్ని మనం మరిచిపోతాం-' అన్నాను మెల్లిగా.

"ఆఁ. కరిగిపోతాం. మన్ని మనం మరిచిపోతాం కదూ" అన్నాడు బిగ్గరగా.

"ఊఁ, కానీ !" అని ఉషారు చేశాను.

"ముఖేష్ కేమోయ్. అతను ఈ శతాబ్దానికే వెలుగు. ముక్కుతో పాడేవాళ్ళలో మణిపూస.- నోనో"అన్నాడు. ఆ అమ్మాయికి బాగా వినపడాలని రేడియో కాస్త వాల్యూమ్ తగ్గించాను. అయితే తరవాత ఏం మాట్లాడాలో వాడు మరిచి పోయాడు. జ్ఞాపకం చేశాను. 'వెన్నలాంటి-'

'ఉఁ. వెన్నలాంటి గొంతుక. కాని దాంటోనే-ఎంత బలం. వినేవాళ్లని-కుదిపి పారేస్తుంది.....'

వాడి ఉపన్యాస ధోరణి మెచ్చుకోవాల్సిందే. కంఠతాపట్టిన లెక్చరేనా, ఆశువుగా మాట్లాడుతున్నట్లు నమ్మించగలడు.

అలాగే ఓ పావుగంట గడిచింది. కృష్ణ గీత బాగుంది. అంచేత ముఖేష్ మళ్లీ రాలేదు. దాంతో వాడికి 'ముఖేష్‌పాట వస్తే బాగుణ్ణు. రాదేం? అంటూ కలవరించే అవకాశం కలిగింది. 'కన్హయ్యా'లో యాద్ ఆయా ఆధీరాత్ కో పాట చూడు మొదట వినగానే, గుండెజల్లుమంటుంది- 'యా' అన్నచోట మరీని-

చెల్లి గొంతు వినపడింది. 'అతనే మా అన్నయ్య ఫ్రెండ్. ముఖేష్ అంటే పిచ్చి అతనికి. మరీ అంతా ఇదేమిటో. వాళ్ళింటో ముఖేష్ రికార్డులు నలభై తొమ్మిది ఉన్నాయి. ..' అని చెప్తోంది.

కృష్ణ అది విని కొత్త గ్రామఫోన్ రికార్డులా మెరిసిపోతూ 'అందులో హిందూస్తానీ భైరవి కోసమే ముఖేష్ పుట్టాడనిపిస్తుంది. ఆరాగం అతని గొంతుకా అంత చక్కగా కలిసిపోతాయి;- మిగతా రాగాలు-'

చెల్లి పక్క గదిలోంచి పిలిచింది. 'అన్నాయ్ నీ పెన్ లో సిరా పోశానూ-నీ పుస్తకాలకీ కాస్త సిరా అయినా, మరో సిరాబుడ్డి మన ఇంట్లో ఉందిగా-మరీ-గాజుపెంకులు చేత్తో ఏరవచ్చా. ఎన్నిముక్కలైనా-నేను పరుగెత్తుకెళ్లి చూసి జుట్టు పీక్కోబోయి రాజ్యలక్ష్మి ఉందని మానేశాను. నా పుస్తకాలు (వాటిల్లో మూడు కొత్తవి) చక్కగా నీలం సిరాలో స్నానం చేసి పునీతములు అయ్యాయి. నేలమీద సిరా అడకత్తెర వ్యూహం వేసి చరచరా నా 'రోమియో" బూట్ల వేపు సాగిపోతోంది.

నా వస్తువుల్ని రక్షించుకోవడం మొదలెట్టాను. కంగారుగా చెల్లి కూడా సిరాలో కాళ్లు వేసి ఆ కాళ్లతో చాప తొక్కుతూ శాయశక్తులా (సిరాకి) తోడు పడుతోంది.

చివరికి సిరా అంతా తుడిచేసి రొప్పుతూ నిల్చుని చుట్టూ చూశాను. చెల్లి నిశ్శబ్దంగా

నవ్వుతోంది. నాకు చిర్రెత్తుకొచ్చి 'నవ్వడం కూడా ఎందుకు. గొప్ప పనిచేసి-' అన్నాను. 'ష్' అని నా గడివేపు చూపింది. చూశాను. రాజ్యలక్ష్మి అక్కడుందని వినిపిస్తోంది.

'...ఇన్నాళ్లూ ముఖేష్ అంటే నా అంత ఇష్టపడే వాళ్లు ఇంకెవరూ ఉండరనుకునేదాన్ని-', అంది, రాజ్యలక్ష్మి. ఆమెను మాట్లాడనీయకుండా 'నేనూ సరిగ్గా అలాగే అనుకొనేవాణ్ణి. నాకు ముఖేష్ అంటే ఇంత పిచ్చేమిటి? ఇది సైకలాజికల్ ఎబ్‌నార్మాలిటీ కాదు కాదు. ఓసారి డాక్టర్ను కనుక్కుంటే? ఏమంటాడో అనిపించేది...ఇపుడు-' అన్నాడు కృష్ణ.

'ఛీ డాక్టర్ని అడగడానికి అదేం జబ్బుకాదు. అదోగొప్ప సుగుణం. ముఖేష్‌ని అభిమానించడం దేశభక్తి, కళాభిమానం లాగానే-'.

"ఎగ్జాక్ట్‌లీ. అదోబ్లెసింగ్ నిజంగా దేవుడిచ్చిన వరం. ముఖేష్ మామూలు మనిషి కాడండీ-' అంటూ ఓ నిముషం మాట్లాడేసి ఆ అమ్మాయి తనని వినడం లేదని గ్రహించి అలాగే నోరు తెర్చుకొని ఉండిపోయాడు కృష్ణ. రేడియోలో ముఖేష్ పాట 'రుక్కుజా, జానేవాలీ-' వస్తోంది. రాజ్యలక్ష్మి పేరుకి ఇక్కడుంది గాని మనస్సు బొంబాయిలో ముఖేష్ చుట్టూ గిరగిరా తిరుగుతోందనిపిస్తుంది. చూస్తుంటే. పాట అయిపోయాక ఉలిక్కిపడి, 'ఓ. నేనిక్కడే ఉన్నానే!' అంది. మేం ఆశ్చర్యపోయాం- ఆ తన్మయత్వం చూసి. ఆమె కళ్లు మెరుస్తున్నాయి. కృష్ణని పరకాయించి చూసి, 'ఈపాట విన్నారుగా. ఈపాట ముఖేష్ కొత్తపద్ధతిలో పాడాడు-'అంది.

'అవును. రుక్కుజా... అంటూ పెద్ద కెరటం విరిగి పడుతున్నట్లు మొదలెడతాడుకదూ. భలేపాట.'

రాజ్యలక్ష్మి మొహం అంతా వెలిగిపోతోంది. 'ఇన్నాళ్ళకి చూశాను. ముఖేష్‌ని ఇంత బాగా అర్థం చేసుకున్న మొగాణ్ణి' అంది.

ఏం మొగాళ్లకి అతని గొప్ప తెలీదా. ఆడవాళ్లకే అర్థం అవుతాడా. ఆమాటకొస్తే-'ధాటిగా పందెపుకోడిలా ముందుకొచ్చాడు కృష్ణ.

'ఊఁ. ఆనాడు-ఆడవాళ్లని అందమైనజాతి అనడం తప్పన్నర అని మీరెలా వాదించారు.' చురచురా చూస్తూ అంది రాజ్యలక్ష్మి. ఆమె కళ్లు పెద్దపులికళ్లలా మెరుస్తున్నాయి. ఆవేశంతో ముఖం ఎర్రపడిపోయింది.

'గోవిందా, గోవింద !' అనుకున్నాను. కృష్ణకి ముఖేష్ ఇష్టమని తెలిసినా కూడా పాత కసి మరిచిపోలేదు, ఈపిల్ల. గడుగ్గాయే ! ఇంకేం ఆశ కనిపించలేదు నాకు. ఇంకే దారీ తోచలేదు నాకు.

అయితే కృష్ణ మెదడు ఉన్నసమయాల్లో బాగానే వాడుకుంటాడు. ఆ పిల్లకి కోపం వచ్చింది. అందులోనూ అది చాలా పాత కక్ష గురించి. చూసి వాడు కంగారుపడ్డా వెంటనే లేచి ఓ ! మీకళ్లు చూస్తే నాకు ముఖేష్ పాట ఒకటి జ్ఞాపకం వస్తోంది. ఆఁ. ఈ మధ్యే వచ్చిందంటూ .....నీకళ్లనిండా మాయ 'అనో ఏదో అర్థం. చెప్తారా ....' అన్నాడు.

రాజ్యలక్ష్మి ఉత్సాహంగా 'నిజమే ఆ పాట చాలా బాగుంటుంది. "నయినాహైఁ జాదూ, భరే-"

'అదేఅదే' అని ఉత్సాహంగా చప్పట్లు కొట్టాడు కృష్ణ. అదిసరేగాని అంతకంటే బాగుండేది' జాపుఁ కహాఁ బతాఐదిల్!' అనే పాట. చాలా తమాషా వరుస-' అని కాస్తపాడి వినిపించి, 'కహతీహైఁ జిందగీ ఇస్ జహాఁసే నికల్' అంటూంటే ......ఎక్కడికో తేలితేలి పోతున్నట్లుంటుంది?' అన్నాడు.

రాజ్యలక్ష్మి తల ఆడించింది.

ఇద్దరూ కొంతసేపు మాట్లాడలేదు. ఒకరి కళ్లల్లోకి ఒకరు చూస్తూ ఉండిపోయారు.

'ముఖేష్ కంటే నాకు మీరంటే ఇష్టం' అన్నాడు కృష్ణ ఎంతో ఆలోచించిన వాడిలా తీవ్రంగా. అమ్మాయి అర్థంకానట్లు చూసింది.

'నిజంగానే' అన్నాడు. ఓ గుటక మింగి. కోపంగా చూసింది.

ముఖేష్ పాటవింటూంటే పరవశించి ముఖేష్ పాడుతున్నాడనే మరిచిపోతాను. మిమ్మల్ని చూస్తుంటే నేనే గుర్తుండను.'

ఆ అమ్మాయి 'గొప్పే. మీరు మీకు గుర్తుండక పోవటమే మంచిది. మీరు ఎవరికైనా గుర్తుండాల్సినంత మంచివాళ్లేం కారు!' అని చివాలున లేచింది. వాడు ఆనాడు స్టేజీ ఎక్కి మాట్లాడి ఆమెకు చేసిన గాయం ఇంకా పోలేదు. ఇంకేది దారి?

నేను ఆశలు ఒదులుకున్నాను.

కృష్ణ మాత్రం మోరపైకెత్తి 'రుక్కుజావో జానేవాలీ రుక్కుజా' అనీ పాడాడు. అంతే. మంత్రం విన్న పాములా ఆగిపోయింది రాజ్యలక్ష్మి. నిలుచుండి పోయిందే కాని వెనక్కి తిరగలేదు.

'ఓ ఎవరిమీదో కోపగించి రెండు జడలు వేసుకోనని ఒట్టేసుకున్న రెండుజడల అమ్మాయీ -ఇటు తిరుగు' అన్నాడు జలుబు బాగా చేసి ముఖేష్ గొంతులా అనుతున్న గొంతుతో. రాజ్యలక్ష్మి తిరిగింది.

'ముఖేష్ అంటే నాకు ఇష్టం-అని ఒప్పుకున్నావా' అని అడిగాడు.

ఒప్పుకున్నట్లు సూచనగా తల ఆడించింది. రాజ్యలక్ష్మి.

'అతని పాటలు నీకు ఇష్టం అని తెలిసి నేను మురిసిపోలేదూ? ముఖేష్ గొంతుకలాంటి గొంతుక కోసం కావాలని మంచులో పడుకుని పడిశం పట్టించుకోలేదూ?' అన్నాడు బరువుగా.

టక్కున కృష్ణవేపు తిరిగింది రాజ్యలక్ష్మి. తను ఆమాటలు విని కరిగి పోతున్నట్లు కనపడకుండా కాళికాదేవిలా మొహం మాత్రం పెట్టింది.

'ఎప్పుడో ఓనాడు స్టేజి మీద ఏదో మాట్లాడానని ఒచ్చిన కోపం ఇంకా దాచుకుంటారా ఎవరేనా? కావలిస్తే నన్ను రోజుకు నూరుసార్లు కోపగించుకునే అవకాశం కలిగిస్తాను....ఎందుకంటే నిన్ను-ప్రేమిస్తున్నాను' అన్నాడు కృష్ణ.

వాడి మొహం కందిపోయింది. నేను ఎప్పుడో చూసిన ఓ సినిమా షూటింగు గుర్తొచ్చింది. తేడా ఏమిటంటే అక్కడ హీరో 'నిన్ను ప్రేమిస్తున్నాను' అని అనడానికి పదిమంది డైరక్టర్ల సహాయంతో అరగంట పట్టింది. ఆ హీరోయిన్ అంద చందాలు అలాంటివి,

మరి!

నేనింక బయటకు పోవటం మంచిదనుకుంటున్నాను.

రాజ్యలక్ష్మి చెయ్యి ఆనించి ఓ అజంతా బొమ్మలా నిల్చుంది. కోపంగా ఉన్నట్లు కనపడాలని చాలా శ్రమపడింది కాని ఎవరు నమ్ముతారు?

'నాకు మీ ప్రేమ అంటే నమ్మకం లేదు. మీకు నేనన్నా, పెళ్లన్నా, ఆడవాళ్లన్నా చాలా కోపం వచ్చేస్తుందిగా. ఆడవాళ్లు అందమైన జాతికాదుగా !' మరి ఆఖరికి పరీక్షపెట్టింది. నాకు నవ్వొస్తోంది చూస్తోంటే. కిష్టిగాడికి నవ్వురావటం లేదు, ఏడుపు ముంచుకొచ్చేలా ఉంది.

వాడు కోపంగా గట్టిగా వూపిరి పీల్చి 'సరే. నువ్వింక నన్ను మరిచిపోవచ్చు. నేనూను. నాకు జీవితం మీదే విరక్తి పుట్టేసింది. ఇంక జుట్టు మొహంమీద చచ్చినా పడనివ్వను. తలదువ్వేసుకుంటున్నాను. రోజుకి ముప్పైసార్లు. కాదు. ముప్పై ఒకటిసార్లు. ఆఁ ' అని దువ్వెన అందుకోబోయాడు.

లక్ష్మి కంగారుగా లేచి ఏమిచెయ్యాలో తోచక, 'ఆఁ ఆఁ. ఒద్దు ఒద్దు. మీరు చెప్పినట్టల్లా వింటాను. మీరు తలదువ్వుకుంటే నామీద ఒట్టే ! ఒట్టే! మీరు జుట్టు మొహంమీద వేసుకుంటేనే చాలా ఇష్టం నాకు' అంది ఆత్మాభిమానాన్ని ఓ క్షణం మరిచిపోయి.

'నేను ప్రేమించాను, నన్ను ప్రేమించు, అన్నాను. ప్రేమించాలేదు, ప్రేమించనీయాలేదు. గుండెరాయి చేసుకుని తలదువ్వేసుకుందామని నిశ్చయించుకున్నాను. అది పడనియ్యవు. నేనేమై పోవాలి? 'అని మూతి ముడుచుకు కూర్చున్నాడు కృష్ణ.

రాజ్యలక్ష్మి "ఒద్దు ఒద్దు. ఏమీ కావద్దు. ఇలాగే ఉండిపోవాలి. రోజంతా కాలేజీ అమ్మాయిల్ని వెదుక్కుంటూ గడిపేస్తూ; గొప్పకి, ఆడవాళ్లు అందమైనవాళ్లనడం తప్పున్నర అని లెక్చర్లు దంచుతూ ఉండాలి. నాకు ముఖేష్ అంటే ఇష్టమని తెలిసి పరుగెత్తికెళ్లి ముఖేష్ రికార్డులన్నీ కొనేసి తెలిసేసుకుని నాకు అతన్ని గురించి...తప్పులు-అన్నీ...కదూ' అంది ఎత్తిపొడుపుగా.

కృష్ణ పొంగిపోయాడు. కథ సుఖాంతమే అని నాకు తెలిసిపోయింది. అంతే.

(ఆంధ్ర ప్రభ; వీక్లీ- 21-12-1960)

★